

## టైటిల్ పోరులో సబలెంక X పెగుల

యూఎస్ ఓపెన్: టాప్ సీడ్ అరీనా సబలెంక (బెలారస్) వరుసగా రెండో సారి యూఎస్ ఓపెన్ ఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం న్యూయార్క్‌లోని ఆర్థర్ ఆషే స్టేడియం వేదికగా జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో సబలెంక.. 6-3, 7-6 (7/2)తో అమెరికా యువ సంచలనం ఎమ్మా నవరోను ఓడించింది. ఫైనల్‌లో ఆమె యూఎస్‌ఏకే చెందిన జెస్సిక పెగులాతో తాడో పేడో తేల్చుకోనుంది. మరో సెమీస్‌లో ఆరో సీడ్ జెస్సిక.. 1-6, 6-4, 6-2తో కరోలినా ముచోవా (చెక్ రిపబ్లిక్)ను చిత్తుచేసి తొలిసారి ఈ టోర్నీ ఫైనల్స్‌కు అర్హత సాధించింది.

## డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు నీరజ్

- నదీమ్‌కు దక్కని చోటు

ఢిల్లీ: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఈ నెల 13, 14 తేదీలలో బ్రస్సెల్స్ (బెల్జియం) వేదికగా జరుగబోయే ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. ఈ ఏడాది దోహా, లుసానే డైమండ్ లీగ్స్‌లో పాల్గొని 14 పాయింట్లు సాధించిన నీరజ్.. నాలుగో స్థానంతో తుది పోరులో చోటు దక్కించుకున్నాడు. ఈ జాబితాలో అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), జులియన్ వెబర్ (జర్మనీ), జాకబ్ వాద్లెచ్ (చెక్) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. కాగా ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయాడు.

## పోప్ సెంచరీ

లండన్: శ్రీలంకతో జరుగుతున్న మూడో టెస్టులో ఆతిథ్య ఇంగ్లండ్ భారీ స్కోరు దిశగా దూసుకెళుతున్నది. తాత్కాలిక కెప్టెన్ ఒలీ పోప్(103 బంతుల్లో 103 నాటౌట్) సెంచరీకి తోడు డకెట్ (86) అర్ధసెంచరీతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 221/3 స్కోరు చేసింది. లంక బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ పోప్.. దూకుడుగా ఆడాడు. తన ఇన్నింగ్స్‌లో 13 ఫోర్లు, రెండు సిక్స్‌లతో చెలరేగాడు. పోప్‌తో పాటు బ్రూక్ (8) క్రీజులో ఉన్నాడు.

# పసిడి ప్రవీణ్

## హైజంప్‌లో మూడో పతకం.. భారత్‌కు ఆరో స్వర్ణం



పారిస్: పారాలింపిక్స్‌లో భారత పారా అథ్లెట్ల పతకాల జోరు కొనసాగుతోంది. శారీరక వైకల్యాన్ని సైతం లెక్కచేయకుండా అంతర్జాతీయ క్రీడా వేదికపై మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడిస్తున్న మన క్రీడాకారుల ప్రదర్శనతో పతకాల పట్టికలో భారత్ టాప్-10 దిశగా దూసుకెళ్తోంది. ఈ క్రీడలలో ఇప్పటికే దేశం తరపున అత్యుత్తమ ప్రదర్శన నమోదుచేసి 25 పతకాలు సాధించిన దేశానికి శుక్రవారం మరో స్వర్ణం దక్కింది. పురుషుల హైజంప్ (టీ64)లో యువ పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్.. రికార్డు స్థాయిలో 2.08 మీటర్ల (ఆసియా రికార్డు) ఎత్తుకు దూకి పసిడి దక్కించుకున్నాడు. 21 ఏండ్ల వయసులోనే రెండో పారాలింపిక్స్ ఆడుతున్న అతడు టోక్యోలో రజతం నెగ్గగా పారిస్‌లో దాని రంగు మార్చడం విశేషం. హైజంప్‌లో భారత్‌కు ఇది మూడో పతకం. దీంతో పతకాల పట్టికలో భారత్ తన స్థానాన్ని మరింత (14) మెరుగుపరుచుకుంది.



**భళా ప్రవీణ్**

పురుషుల హైజంప్ (టీ64)లో ప్రవీణ్‌కుమార్ పసిడి సాధించాడు. ఆరుగురు అథ్లెట్లు పోటీపడ్డ ఫైనల్‌లో ఈ నోయిడా కుర్రాడు.. 2.08 మీటర్ల ఎత్తుకు దూకి మొదటి స్థానంలో నిలిచాడు. యూఎస్‌ఏ అథ్లెట్ డెరెక్ లొక్సిడెంట్ (2.06 మీటర్లు), ఉక్రెయిన్‌కు చెందిన టెముర్‌బెక్ జియాజొవ్ (2.03 మీటర్లు) వరుసగా రజత, కాంస్యాలు గెలిచారు. 1.89 మీటర్ల ఎత్తు నుంచి స్వర్ణ పతక రేసు మొదలుపెట్టిన ప్రవీణ్.. 2.08 మీటర్లతో గోల్డ్ మెడల్ కొట్టాడు. ఈ పతకంతో ప్రవీణ్ 21 ఏండ్ల వయసులోనే పారాలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన అథ్లెట్‌గా చరిత్ర సృష్టించాడు. కాగా తంగవేలు మరియప్పన్, శరద్ కుమార్ తర్వాత భారత్‌కు హైజంప్‌లో ఇది మూడో పతకం.
టీ64 కేటగిరీ అంటే ఒక అథ్లెట్ కాలు ఒకటి చిన్నగా లేదా రెండు కాళ్లు మోకాళ్ల కింది భాగంలో సక్రమంగా లేకపోవడం. ప్రవీణ్ పుట్టినప్పుడే ఎడమ కాలు చిన్నగా ఉంది. వయసు పెరుగుతున్న క్రమంలో అతడు తన వైకల్యం కారణంగా ఆత్మనూన్యత భావానికి గురయ్యాడు. ఆ బాధల నుంచి బయటపడటానికి గాను క్రీడల వైపునకు మళ్లాడు. చిన్నప్పుడు వాలీబాల్ బాగా ఆడే ప్రవీణ్‌లోని ప్రతిభను గమనించిన పారా అథ్లెట్ కోచ్ జి. సత్యపాల్ సింగ్ అతడిని హైజంప్ వైపునకు ప్రోత్సహించాడు. ఇక ఆ తర్వాత నుంచి అతడి కెరీర్ కీలక మలుపు తీసుకుంది. 18 ఏండ్ల వయసులోనే టోక్యో పారాలింపిక్స్‌లో పాల్గొన్న ప్రవీణ్.. ఆ టోర్నీలో రజతం గెలిచాడు.

**కనోయింగ్‌లో సెమీస్‌కు..**

కనోయింగ్‌లో ఇద్దరు భారత ఆటగాళ్లు సెమీస్‌కు అర్హత సాధించారు. మహిళల వీఎల్2 200 మీటర్ల హీట్‌లో ప్రాచి యాదవ్, పురుషుల కెఎల్1 200 మీటర్ల హీట్‌లో యశ్ కుమార్ 4, 6 స్థానాలు సాధించి సెమీస్‌కు దూసుకెళ్లారు. శనివారం సెమీస్ పోటీలు జరుగుతాయి. మహిళల పవర్ లిఫ్టింగ్ 67 కిలోల విభాగంలో కె. రాజమణి 106 కిలోలు ఎత్తి 8వ స్థానంలో నిలిచింది. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్54 ఈవెంట్‌లో దీపేశ్ కుమార్ 26.11 మీటర్లతో చివరి స్థానంలో నిలిచాడు. మహిళల 200మీ.ల టీ12 రేసులో భారత అథ్లెట్ సిమ్రాన్ శర్మ 25.03 సెకన్ల టైమింగ్‌తో తుది పోరుకు అర్హత సాధించింది.

**26కు చేరిన పతకాల సంఖ్య**

**200మీ.ల టీ12 రేసు ఫైనల్లో సిమ్రాన్**

## పతాకధారులుగా హర్విందర్, ప్రీతి

పారిస్ పారాలింపిక్స్ ముగింపు వేడుకల్లో ఆర్చర్ హర్విందర్‌సింగ్, యువ అథ్లెట్ ప్రీతి పాల్ జాతీయ పతాకధారులుగా వ్యవహరించనున్నారు. ఆదివారం జరిగే కార్యక్రమంలో వీరిద్దరు జాతీయ జెండా చేతపట్టుకుని మార్చ్ పాస్ట్‌లో పాల్గొంటారు. పారాలింపిక్స్‌లో తొలి పసిడి పతకంతో హర్విందర్ కొత్త చరిత్ర లిఖించగా, ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన అథ్లెట్‌గా ప్రీతి రికార్డుల్లోకెక్కింది.



## పతకాల పట్టిక

| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | చైనా | 79 | 62 | 41 | 182 |
| 2 | బ్రిటన్ | 41 | 31 | 23 | 95 |
| 3 | అమెరికా | 30 | 35 | 18 | 83 |
| 4 | నెదర్లాండ్స్ | 24 | 14 | 10 | 48 |
| 5 | ఇటలీ | 20 | 13 | 29 | 62 |
| 6 | ఫ్రాన్స్ | 17 | 24 | 24 | 65 |
| 15 | భారత్ | 6 | 9 | 11 | 26 |

దే : దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం



## రాజస్థాన్ చీఫ్ కోచ్‌గా ద్రవిడ్

రాజస్థాన్ రాయల్స్ చీఫ్ కోచ్‌గా దిగ్గజ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ నియమితుడయ్యాడు. గత కొన్ని రోజులుగా వస్తున్న వార్తలకు బలం చేకూరుస్తూ రాయల్స్ యాజమాన్యం శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. గతంలో కెప్టెన్‌గా, కోచ్‌గా వ్యవహరించిన ద్రవిడ్..తిరిగి రాజస్థాన్ జట్టుకు సేవలందించబోతున్నాడు.



## దీప్తికి ఘన స్వాగతం

మలక్‌పేట, సెప్టెంబర్ 6 :ప్రతిష్ఠాత్మక పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించి శుక్రవారం నగరానికి చేరుకున్న యువ అథ్లెట్ జీవాంజి దీప్తికి ఘన స్వాగతం లభించింది. వందలాది మంది అభిమానులతో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రాంగణం కోలహలంగా మారింది. స్వాగత కార్యక్రమంలో సాట్స్ చైర్మన్ శివాసేనారెడ్డి, కోచ్‌లు రమేశ్, గోపీచంద్, తెలంగాణ పారా అసోసియేషన్ ప్రతినిధులు వీరయ్య, బాబు, ప్రశాంత్ పాల్గొన్నారు.

# రసవత్తరంగా దులీప్ ట్రోఫీ



బెంగళూరు: రెండు రోజుల క్రితమే బెంగళూరు, అనంతపురం వేదికలుగా మొదలైన దులీప్ ట్రోఫీ రసవత్తరంగా సాగుతోంది. అనంతపురంలోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఇండియా 'సీ' వర్సెస్ ఇండియా 'డీ' మ్యాచ్ రెండు రోజులకే ఆసక్తికరంగా మారింది. రెండో రోజు 91/4 ఓవర్ నైట్ స్కోరు వద్ద ఆట ఆరంభించిన ఇండియా సీ.. మొదటి ఇన్నింగ్స్‌లో 168 పరుగులకే ఆలౌట్ అయింది. ఇంద్రజీత్ (72) టాప్ స్కోరర్. యువ పేసర్ హర్షిత్ రాణా (4/33) నాలుగు వికెట్లతో రాణించగా అక్షర్ పటేల్, సారాన్ష్ జైన్ తలా రెండు వికెట్లతో చెలరేగారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా 'డీ'.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 49 ఓవర్లలో 206 పరుగులు చేసి 8 వికెట్లు కోల్పోయింది. శ్రేయస్ అయ్యర్ (54), పడిక్కల్ (56) రాణించారు.

**ఇక ఇండియా 'బీ' మ్యాచ్ విషయానికొస్తే..**

202/7 వద్ద రెండో రోజు ఆటకు వచ్చిన ఆ జట్టుకు ముషీర్ ఖాన్ (181), నవ్‌దీప్ సైనీ (56) క్రీజులో నిలవడంతో తొలి ఇన్నింగ్స్‌లో 321 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన ఇండియా 'ఏ'.. ఆట ముగిసే సమయానికి 35 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 134 రన్స్ చేసింది. మయాంక్ (36), శుభ్‌మన్ గిల్ (25) తొలి వికెట్‌కు 57 పరుగులు జోడించినా సైనీ ఈ ఇద్దరినీ వరుస ఓవర్లలో పెవిలియన్‌కు పంపాడు.







Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.